'మలేరియా నిర్మూలన లక్ష్యంగా పనిచేయండి'

పార్వతీపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మలేరియా నిర్మూలన లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర అదనపు సంచాలకులు ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరి ఆదేశించారు. మంగళవారం ఎన్జీవో సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి రెండు వారాలకు క్షేత్రస్థాయిలో ఫీవర్ సర్వే చేపట్టి మలేరియా లక్షణాలున్నవారిని గుర్తించాలన్నారు. దోమల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. 2027 నాటికి జిల్లాలో మలేరియా నియంత్రణకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు రక్షణ ఏదీ?

- ఆడలి వ్యూపాయింట్ మలుపుల వద్ద ప్రమాదాలు
- పలువురి మృత్యువాత.. మరికొందరికి గాయాలు
- వరుస ఘటనలతో సందర్శకుల బెంబేలు
- చోద్యం చూస్తున్న ఐటీడీఏ
- కంటితుడుపు చర్యల్లో పోలీసుశాఖ

సీతంపేట రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహజ సిద్ధ అందాలకు నెలవు సీతంపేట మన్యం. అందుకే ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయితే వారికి రక్షణ మాత్రం కరువవుతోంది. ప్రధానంగా గిరిశిఖర ప్రాంతంలో ఉన్న ఆడలి వ్యూ పాయింట్ మార్గంలో వరుస ప్రమాదాలు సంభవించడం అందర్నీ కలవరపరుస్తోంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరికొందరు క్షతగాత్రులు నేటికీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. చేతులు, కాళ్లు విరిగి ఇంకొందరు శాశ్వత వైకల్యంతో బాధపడుతున్నారు. కాగా వరుస ఘటనలతో సందర్శకులు బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు ఐటీడీఏ అధికారులు, పోలీసులు మాత్రం కంటి తుడుపు చర్యలతోనే సరిపెడుతున్నారు. మొత్తంగా పర్యాటకులకు రక్షణ కల్పించడంలో వారు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

- గత ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆడలి వ్యూ పాయింట్‌ను ప్రారంభించారు. అయితే వ్యూ పాయింట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మలుపుల వద్ద పర్యాటకులకు రక్షణ కల్పించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.
- వ్యూ పాయింట్ అందాలు చూడాలనుకుంటే.. శంభాం గ్రామం మీదుగా వెళ్లాలి. అక్కడి నుంచి సుమారు ఐదు కిలోమీటర్లు పైన కొండపై ప్రయాణించాలి. ఈ మార్గంలో బొక్కెడుగూడ, బుడ్డడుగూడ, బిడిందిగూడ, వెల్లంగూడ గ్రామాల జంక్షన్ వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి.
- ఇక్కడున్న ఐదు మలుపుల వద్దనే కొద్దిరోజుల కిందట రెండు ఆటోలు ఢీకొని లోయలోకి దూసుకుపోయాయి. ఈ ప్రమాదంలో ఓ మహిళ ఇటీవల మృతి చెందింది. మరో ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా వెల్లంగూడ గ్రామానికి చెందిన ఓ గిరిజనుడ్ని కూడా ఈ ప్రమాదకర మలుపులు బలితీసుకున్నాయి.
- గత ఏడాది నవంబరు 24న బిడిందిగూడ మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో పాలకొండ పట్టణానికి చెందిన ఓ మహిళ మృతి చెందింది. ఆమె భర్త , కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. అదే రోజున వాటపాగు గ్రామానికి చెందిన ఆటో తిరుగు ప్రయాణంలో మలుపు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూడా ఆ గ్రామానికి చెందిన ఏడుగురు గాయపడ్డారు.


ఆడలి వ్యూ పాయింట్‌కు వెళ్లే మార్గంలో వెల్లంగూడ వద్ద ప్రమాదకర మలుపు

- ఆడలి వ్యూ పాయింట్‌కు వెళ్లే మార్గంలో వెలుగు చూడని ప్రమాదాలు ఇంకెన్నో ఉన్నాయి. ఈ పర్యాటక ప్రాంతం అధికారికంగా ప్రారంభించి ఐదు నెలలు గడుస్తుండగా.. ఇప్పటివరకు ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇప్పుడిప్పుడే పర్యాటకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో ఐటీడీఏ అధికారులు తక్షణమే ఈ మార్గంలో రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

చర్యలు ఇలా..

ఆడలి వ్యూ పాయింట్ మార్గంలో వరుసగా ప్రమాదాలు సంభవిస్తున్నా.. పోలీస్‌శాఖ కంటితుడుపు చర్యలు చేపడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో హెల్మెట్ లేనిదే ద్విచక్ర వాహనాలకు ప్రవేశం లేదని స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో బైక్ ప్రమాదాలు కొంత వరకు తగ్గాయి. కానీ ఓవర్ లోడ్‌తో ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒక్కో ఆటోలో 20 మంది వరకు ప్రయాణికులు ఉండడంతో మలుపుల వద్ద అవి అదుపు తప్పి లోయలోకి దూసుకుపోతున్నాయి. తరచూ ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తున్నా.. రక్షణ చర్యలు మాత్రం చేపట్టడం లేదు. ఆటోలను నియంత్రించాల్సిన పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల ఆడలి వ్యూ పాయింట్ మార్గంలో ఉన్న మలుపుల వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇక ఐటీడీఏ అధికారులైతే తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఆటో ప్రమాదం జరిగిన వెల్లంగూడ మలుపును ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు.

స్పందించకపోవడం సరికాదు..

ఆడలి వ్యూ పాయింట్ మార్గంలో ఉన్న ప్రమాదకర మలుపుల వద్ద రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి. రహదారి విస్తరణ చేపట్టాలి. ఆ మార్గంలో వరుసగా ప్రమాదాలు జరుగుతుంటే ఐటీడీఏ అధికారులు స్పందించకపోవడం సరికాదు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధే కాకుండా సందర్శకుల రక్షణకు కూడా ఐటీడీఏ బాధ్యత వహించాలి. దీనిపై అధికారులు స్పందించకుంటే రానున్న రోజుల్లో ఐటీడీఏ ముట్టడిస్తాం.' అని గిరిజన జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు తెలిపారు.

చర్యలు తీసుకుంటాం..

'ఆడలి వ్యూ పాయింట్ మార్గంలో రక్షణ గోడల ఏర్పాటు, ప్రత్యామ్నాయ రక్షణ చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ ఈఈ పి.రమాదేవిని ఆదేశించాం. ఈ మేరకు ఇంజనీరింగ్ అధికారులు నాలుగు రకాల ప్రతిపాదనలు సమర్పించారు. వాటిని పరిశీలించి రక్షణ చర్యలు తీసుకుంటాం.' అని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు చెప్పారు.


ప్రమాదానికి గురై లోయ లోకి దూసుకుపోయిన ఆటోలు (ఫైల్)

అరకొర అయినా.. సురక్షితమేనా?

- కురుపాం వాసులకు పూర్తిస్థాయిలో అందని తాగునీరు
- మురుగు కాలువల్లో పైప్ లైన్లు
- తరచూ లీకులు
- వెంటాడుతున్న వ్యాధుల భయం
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం

పార్వతీపురం/కురుపాం, జనవరి21(ఆంధ్రజ్యోతి): వేసవి రాకముందే కురుపాం వాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. లీకుల కారణంగా రక్షిత నీటి పథకం నుంచి పూర్తిస్థాయిలో నీటి సరఫరా కావడం లేదు. దీంతో బిందెడు నీటి కోసం కొళాయిల వద్ద నిరీక్షించినా ఫలితం దక్కడం లేదు. మరోవైపు పలువీధుల్లో మురుగు కాలువల్లోనే పైప్‌లైన్లు ఉండడంతో స్థానికులకు వ్యాధుల భయం వెంటాడుతోంది. ప్ర'జల' కష్టాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- కురుపాంలో సుమారు 38 ఏళ్ల కిందట లక్షా 20 వేల లీటర్ల సామర్థ్యంతో రక్షిత నీటి పథకం నిర్మించారు. అదే సమయంలో పలు వీధుల్లో 30 మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే ప్రధానంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న రక్షిత నీటి పథకం కొళాయిల ద్వారా వచ్చే నీటినే ప్రజలు తాగడానికి ఉపయోగించేవారు. ఈ పథకానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న గుమ్మిడిగెడ్డ నుంచి పైప్ లైన్ ద్వారా నీరు ఎక్కించి కొళాయిల నుంచి నీటిని సరఫరా చేసేవారు. అయితే మధ్యలో పైపు లైన్‌లు తరుచూ పగిలిపోవడంతో నీటి సరఫరాకు బ్రేక్ పడింది. దీంతో ప్రజలు కొన్నాళ్ల పాటు బోరు నీటినే వినియోగించేవారు.
- ఇదిలా ఉండగా.. గత 18 ఏళ్ల నుంచి ఎంపీడీవో కార్యాలయం సమీపంలో బోరు ద్వారా ట్యాంక్‌కు నీరు ఎక్కించి.. కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైపు లైన్‌లు పాతవి కావడంలో తరచూ లీకుల సమస్య వెంటాడుతుంది. దీంతో నీరు వృథాగా పోతోంది. పలు వీధుల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.
- ట్యాంక్ సామర్థ్యం చాలకపోవడం, లీకుల వల్ల నీరు వృథా కావడంతో కొన్ని వీధుల్లో 20 నిమిషాలకు మించి నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆయా ప్రాంతవాసులు తాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. కరెంట్ కోత సమయంలోనూ పూర్తిస్థాయిలో ప్రజలకు నీరందడం లేదు. దీంతో వాటర్ క్యాన్లు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.
- కొన్ని వీధులకు వెళ్లే పైపులు మురుగు కాలువల్లో ఉండడంతో ఎక్కడ కలుషిత నీరు కలిసి పోతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గతంలో కాలువలోని పైప్‌లైన్‌లో మురుగు నీరు కలవడంతో సుమారు 500 మంది డయేరియా బారిన పడ్డారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకముందే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కురుపాం వాసులు కోరుతున్నారు.


మురుగు కాలువలో ఉన్న కొళాయి పైపులు


కొళాయి చుట్టూ ఉన్న పరిసరాలు ఇలా..

ప్రతిపాదనలు పంపించాం..

కురుపాంలో అదనంగా రెండు లక్షల లీటర్ల సామర్థ్యంతో రక్షిత నీటి పథకం, పైపు లైన్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ఉన్న రక్షిత నీటి పథకం పైపు లైన్‌లు పాతవి కావడంతో ఎక్కడికక్కడ పగిలిపోయాయి. దీంతో తరచూ లీకుల సమస్య తలెత్తుతోంది. మరోవైపు ట్యాంకు సామర్థ్యం తక్కువ కావడం వల్ల ఎక్కువ సేపు నీటిని సరఫరా చేయలేకపోతున్నాం.

- పి.నాగేశ్వరరావు,
డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కురుపాంలో అతిసారం

- వారం రోజుల్లో 23 కేసుల నమోదు
- వైద్య సిబ్బంది అప్రమత్తం

కురుపాం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో అతిసార విజృంభిస్తోంది. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు 23 కేసులు నమోదయ్యాయి. దీంతో వైద్య సిబ్బంది అప్రమత్తమైంది. ఆసుపత్రికి వస్తున్న రోగులను వైద్య సేవలు అందించి ఇళ్లకు పంపిస్తున్నారు. కాగా ఈ నెల 13 నుంచి రోజుకు రెండు, మూడు కేసులు నమోదు కావడంపై డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు స్పం దించారు మంగళవారం కురుపాం సీహెచ్‌సీని సందర్శించారు. ఆసుపత్రి సూపరెంటెండెంట్ శోభారాణితో మాట్లాడి కేసుల తీవ్రత గురించి అడిగి తెలుసుకు న్నారు. అనంతరం గాంధీనగర్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులను పరామర్శించారు. పరిస్థితి అదుపులో ఉన్నప్పటికీ ఇంటింటికీ సర్వే నిర్వహించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యుడు శంకరరావును ఆదేశించారు. నీటి పరీక్షలు జరపాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వేణు గోపాల్‌ను ఆదేశించారు. పైపులైన్లు లీకులు లేకుండా చూడాలని కోరారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వేడి ఆహర పదార్థాలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.


వైద్య శిబిరం పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

నివారణకు చర్యలు: కలెక్టర్

పార్వతీపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో విజృంభిస్తున్న అతిసార వ్యాధి నివారణ తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. కురుపాం సీహెచ్‌సీతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులను పదుల సంఖ్యలో అతిసార రోగులు ఆశ్రయిస్తున్నందున వైద్య సిబ్బంది అప్రమత్తం కావాలన్నారు. కురుపాంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని , నీటి పరీక్షలు జరపాలని సూచించారు. మెడికల్ క్యాంప్‌ను నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు.

పోలమాంబ సన్నిధిలో భక్తుల రద్దీ

6లో సచివాలయాల ప్రక్షాళన

- కూటమి ప్రభుత్వం అడుగులు

పంచాయతీల్లో పనులు గుర్తించాం

- డ్వామా పీడీ రామచంద్రరావు


మస్తరును పరిశీలిస్తున్న డ్వామా పీడీ

సీతానగరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు గుర్తించామని డ్వామా పీడీ కె.రామచంద్రరావు తెలిపారు. ఉపాధి వేతనదారులందరికీ వంద రోజుల పని కల్పించనున్నామన్నారు. మంగళవారం ఆర్.వెంకంపేట, కాశీపేట, అంటిపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు, మస్తర్లను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, ఏపీవో భాను, టెక్నికల్ సహాయకు లతో సమీక్షించారు. జిల్లాలో 408 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఫారం పాండ్స్, జీడి, మామిడి, ఇతర తోటల గట్లు, ట్రెంచ్ కటింగ్ , భూమి అభివృద్ధి, ఫిష్ పాండ్స్ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గోశాలల నిర్మాణం చేపట్టినా బిల్లులు అందని రైతుల వివరాలను సేకరించాలని ఎంపీడీవోలకు సూచించామన్నారు. నిధుల మం జూరు కోసం కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 167 గోశాలలకు సగం బిల్లులు చెల్లించామన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

బెలగాం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ద్వారపురెడ్డి శ్రీనివాస్ రెండోసారి ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రెడ్డి పావని, పరిశీలకుడు అట్టాడ బాబ్జీ వెల్లడించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ... పార్టీ పెద్దల నమ్మకాన్ని నిలబెడతానని అన్నారు. సమష్టిగా పనిచేసి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యకర్తలను ఎంపీటీసీలుగా, సర్పంచ్‌లుగా గెలుపించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ఉపాధిలో శ్రమశక్తి సంఘాలు

కొమరాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో శ్రమశక్తి సంఘాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు కూటమి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. వాస్తవంగా గత ప్రభుత్వ హయాంలో 50 కుటుంబాలకు సంబంధించిన జాబ్‌కార్డులకు ఒక మేట్ ఉండేవారు. ప్రస్తుతం శ్రమశక్తి సంఘాల ఏర్పాటుతో సగటున 20 జాబ్‌కార్డుల్లో 40 మందికి ఒక మేటును నియమించి పనులను పర్యవేక్షించనున్నారు. ఈ వ్యవస్థలో ప్రతి మేటుకు ప్రోత్సాహకం అందించనున్నారు. క్షేత్ర సహాయకుడు, శ్రమశక్తి సంఘాల్లోని వేతనదారులకు మధ్య అనుసంధాన కర్తగా శ్రమమిత్రలు వ్యవహరిస్తారు. ఈ నేపథ్యంలో మళ్లీ మేట్ల సంఖ్య పెరగనుంది. ఏపీడీ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ ఈ నెలాఖరు నాటికి పూర్తికానుంది. క్షేత్ర సాంకేతిక సహాయకుల పర్యవేక్షణలో ఫిబ్రవరి నుంచి నూతన విధానం అమలు కానుంది. జిల్లా వ్యాప్తంగా 2,08,010 కుటుం బాలకు జాబ్‌కార్డులు ఉండగా, 3,93,282 మంది వేతనదారులు ఉపాధి పనులు చేస్తున్నారు. 'ప్రభుత్వ మార్గదర్శకాలతో శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ సంఘాలతో ఉపాధి పనులపై పర్యవేక్షణ పెరుగుతుంది. సమయపాలనతో పాటు వేతనదారులకు గిట్టుబాటు వేతనం లభించడానికి అవకాశం ఉంటుంది.' అని ఉపాధి ఏపీవో వి.బాలకృష్ణ తెలిపారు.



అరుదైన నాణేలు.. అభిరుచికి దర్పణాలు!

- వివిధ దేశాల కరెన్సీ సేకరణలో డాక్టర్ శారద
- నేటి తరానికి అవగాహన కల్పించడమే లక్ష్యం

ఇప్పుడంతా డిజిటల్ చెల్లింపులు. ఫోన్‌పే, గూగుల్ పేలాంటి ఆన్‌లైన్ వేదికలు. ముఖ్యంగా నాణేల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. కానీ ఒకప్పుడు వీటిదే అగ్రస్థానం. అదీ రాగి వంటి లోహాలతో తయారు చేసినవే అధికం. వీటిపై అవగాహన కల్పించడంతో పాటు వివిధ దేశాల కరెన్సీ ఎలా ఉంటుందో మిగిలిన వారికి తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నారు బొబ్బిలికి చెందిన డాక్టర్ శారద.

బొబ్బిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి)

వివిధ దేశాల కరెన్సీ నోట్లు.. నాణేలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలని ఉందా? అదీ ప్రత్యక్షంగా. అయితే బొబ్బిలి వెళదాం రండి. అక్కడ మన దేశంతో పాటు ఇతర దేశాల కరెన్సీ నోట్లు.. నాణేలు చాలా చూడొచ్చు. బొబ్బిలి ఫూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన డాక్టర్ చింతా శారద 1808 నాటి నాణేలతో పాటు 26 దేశాలకు చెందిన 115 రకాల కరెన్సీని, 425 రకాల నాణేలను సేకరించారు. ఆమె హాబీని గుర్తించి స్నేహితులు బహుమతిగా ఇచ్చినవి కొన్నయితే... మరికొన్నింటిని ఆమె వివిధ వర్గాలు, ప్రాంతాల నుంచి సేకరించారు. సీతారాములు, ఆంజనేయుడు, కాళికామాత, సరస్వతీదేవి, రాధాకృష్ణులు కొలువుదీరినట్లు ముద్రించిన నాణేలు ఆమె సేకరించిన వాటిలో ఉన్నాయి. మనదేశానికి చెందిన పాత, కొత్త కరెన్సీ నోట్లతో పాటు ఇంగ్లండ్, సింగపూర్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, స్వీడన్, నేపాల్, మలేషియా, ఇండోనేషియా, కెనడా తదితర దేశాలకు చెందినవి ఆమె దగ్గర పదిలంగా ఉన్నాయి. రాష్ట్రంలో వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శనల్లో వీటన్నిటినీ ఆమె ప్రదర్శించారు. విద్యా సంస్థల్లోనూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు వినియోగిస్తుంటారు.





వివిధ దేశాల కరెన్సీ నోట్లు, నాణేలు

అవగాహన పెంచేందుకు..



ఒకప్పటి కరెన్సీ, నాణేల చలామణీపై ఆసక్తితో వాటిని సేకరించడం ప్రారంభించాను. కొన్నాళ్ల కిందటి వరకు వినియోగంలో ఉన్న మన దేశపు పైసా, పరక, అణా, పావలా, అర్ధ రూపాయి వంటివి నేటి తరం వారికి తెలియవు. డిజిటల్ కరెన్సీ విధానం అమలులోకి రావడంతో ఎక్కువగా ఆ తరహాలోనే లావాదేవీలు జరుగుతున్నాయి. రాజులు, నవాబుల పాలనా కాలంలో వారి బొమ్మలతో నాణేలు, కరెన్సీ ఉండేవి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జాతిపిత మహాత్మాగాంధీ చిత్రంతోను, దేశీయ ఆనవాళ్లు, దేశంలోని విశిష్ట ప్రదేశాల బొమ్మలతో కరెన్సీని రూపొందిస్తున్నారు. వీటన్నిటిపైనా నేటి తరం పిల్లలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాను.

-డాక్టర్ చింతా శారద, బొబ్బిలి

ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా..

- ఉంగరాడ గురుకులంలో వర్క్‌షాప్
- సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న రూపావతి

రేగిడి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ఈ ఏడాది టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాల సాధన దిశగా ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ మేరకు ఉంగరాడ బి.ఆర్. అంబేడ్కర్ గురుకులంలో మంగళవారం ఉమ్మడి జిల్లాకు చెందిన 13 గురుకుల కళాశాలల అధ్యాపక సిబ్బందికి వర్క్‌షాపు నిర్వహించారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధకులు 150 మంది (జేఎల్, పీజీటీ, టీజీటీలు) హాజరయ్యారు. ఈ ఏడాది పది, ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతో పాటు, బాగా చదివే పిల్లలకు మెరుగైన ర్యాంక్‌లు లక్ష్యంతో ఈ వర్క్‌షాపు నిర్వహించారు. విజయనగరం, మన్యం జిల్లాల గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రూపావతి దీనిని ప్రారంభించారు. గ్రూపు సబ్జెక్టులకు సంబంధించి ఇక్కడ వర్క్‌షాప్ నిర్వహించగా.. భాషలకు సంబంధించి విజయనగరం జిల్లా వీఎంపేటలో బుధవారం నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ వెల్లడించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు విభాగాల్లో దీన్ని నిర్వహించారు. నాణ్యమైన బోధన, వెనుకబడిన విద్యార్థులు పరీక్షల్లో గట్టెక్కేందుకు అవసరమైన చిట్కాలు.. బాగా చదివే పిల్లలు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన మెలకువలను రిసోర్స్‌పర్సన్లు వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంతో అందరూ ముందుకు వెళ్లాలని కోఆర్డినేటర్ రూపావతి సూచించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం..

ఉమ్మడి జిల్లాలో ఉన్న 13 గురుకులాల్లో పది, ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గురుకులాల కోఆర్డినేటర్ ఎస్.రూపావతి తెలిపారు. దీని కోసం వర్క్‌షాపుల నిర్వహణ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఉంగరాడ గురుకులాన్ని మంగళవారం సందర్శించిన ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాల గురుకులాల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు వెయ్యి మంది, ఇంటర్‌కు 650 మంది వరకు హాజరు కానున్నట్టు వివరించారు. శతశాతం ఉత్తీర్ణతకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గ్రూపు, లాంగ్వేజ్ సబ్జెక్టుల వారీగా వర్క్‌షాపుల నిర్వహణ, వెనకబడిన విద్యార్థులకు అదనపు శిక్షణ తరగతులు, నాణ్యమైన బోధన దిశగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. గురుకులాల్లో ఎక్కడా బోధనేతర సమస్యలు లేకుండా దృష్టి సారించినట్లు వివరించారు. సిబ్బంది ఖాళీలపై ఎప్పటికప్పుడు సమీక్షించి.. కాంట్రాక్టు పద్ధతిలలో సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు.



చర్చా వేదికలో పాల్గొన్న అధ్యాపకులు

సచివాలయాల ప్రక్షాళన

- కూటమి ప్రభుత్వం అడుగులు
- సిబ్బంది వివరాల సేకరణ



కొమరాడ గ్రామ సచివాలయం

జనాభా ప్రాతిపదికన..

ప్రస్తుతం గ్రామీణ ప్రాంత సచివాలయాల్లో పది మంది చొప్పన సిబ్బంది పని చేస్తున్నారు. పట్టణ ప్రాంత సచివాలయాల్లో ఎనిమిది మంది చొప్పున ఉన్నారు. ఎక్కువ జనాభా ఉన్న పట్టణాల కంటే తక్కువగా ఉన్న గ్రామాల్లో సిబ్బంది సంఖ్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోని ఉద్యోగులపై అధిక భారం పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన విధానంతో 2,500 మంది జనాభా లేదా ఐదు కిలోమీటర్ల దూరంలోని గ్రామాలను, వార్డులను యూనిట్‌గా తీసుకొని ఉద్యోగ విభజన చేయనున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు స్థానికంగా సేవలందించే పేరుతో భారీ సంఖ్యలో సిబ్బందిని భర్తీ చేశారు. వీరిలో కొంతమంది సిబ్బందికి పని తక్కువగా ఉండగా, మరి కొంత మందిపై భారం పడుతోంది. తాజాగా కూటమి ప్రభుత్వం కొంత మందిపై పనిభారాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టనుంది.

కొమరాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ప్రజలకు సేవలను మరింత చేరువ చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల హేతుబద్ధీకరణపై దృష్టి సారించింది. ఇప్పటికే క్షేత్ర స్థాయి నుంచి సిబ్బందికి సంబంధించిన సమాచారాన్ని సేకరించింది. త్వరలో మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టనుంది. ఉద్యోగుల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని యోచిస్తోంది.

ఎక్కడెక్కడ వినియోగిస్తారంటే...

నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఆహార శుద్ధి, మార్కెటింగ్, ఉపాధి కోసం ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఔత్సాహిక యువతను గుర్తించి ప్రోత్సహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడ ఎక్కువ మంది సిబ్బంది ఉన్నారో గుర్తించి... అవసరమైన ప్రాంతాలకు సర్దుబాటు చేసేలా కసరత్తు చేస్తున్నారు.

వివరాల సేకరణ..

జిల్లా వ్యాప్తంగా 350 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతంలో 312, పట్టణ ప్రాంతంలో 38 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో సుమారు 2,971 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల్లో చాలామంది ఇంజనీరింగ్, డిప్లమో, పీజీ, పీహెచ్‌డీలు చేసిన వారు ఉన్నారు. వీరి సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో సీఎఫ్ఎంఎస్ ఐడీ, ఫోన్ నంబరు, విద్యార్హత, కులం, తదితర వివరాలను సేకరిస్తున్నారు.

సమాచారం అందించాం..

సచివాలయాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగుల వివరాలను, విద్యార్హతలను ప్రభుత్వం ఇటీవల అడిగింది. ఆ మేరకు సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికి సంబంధించచిన విద్యార్హతల వివరాలను అందించామని మండలంలోని ఓ సచివాలయ కార్యదర్శి వివరించారు.

పోలమాంబ సన్నిధిలో భక్తుల రద్దీ

- ఆంధ్రా, ఒడిశాల నుంచి రాక



శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి సన్నిధి భక్తులతో మంగళవారం కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే అమ్మవారి చదురుగుడి, వనంగుడి పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వనం గుడి వద్ద వేప చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గోముఖి నదీ తీరాన అమ్మవారికి కోళ్లు, చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. చదురుగుడిలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారి ఘటాలకు కుంకుమ పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఆలయాల పరిసర తోటల్లో వంటా వార్పూ చేశారు. కుటుంబ సభ్యులతో కలసి అక్కడే భోజనాలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముస్తాబవుతున్న శంబర..

ఈ నెల 27, 28, 29 తేదీల్లో పోలమాంబ జాతర జరుగనున్న దృష్ట్యా దేవదాయ శాఖ సిబ్బంది ఏర్పాట్లు ముమ్మరం చేశారు. చదురుగుడి, వనంగుడిల వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిళ్లు వేశారు. కేశఖండన ప్రాంతాన్ని చదును చేసి విశాలమైన ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేశారు. నూతనంగా నిర్మించిన వనంగుడి రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించడంతో క్యూలైన్‌లో వేచి ఉండే భక్తులకు ఇబ్బందులు తప్పనున్నాయి.



చదురుగుడిలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆరోగ్య కేంద్రాలను వదిలేశారు



బొబ్బిలి రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

- మూడేళ్లుగా నిధులు లేవు
- నీరుగార్చిన జగన్ సర్కారు
- కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

రాజాం, జనవరి 21(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పట్టణ ఆరోగ్య కేంద్రాల పనితీరు దారుణంగా ఉంది. అవి అసలు పట్టణాల్లో ఉన్నాయని చాలా మందికి తెలియదనడంలో సందేహం లేదు. దీంతో పట్టణ ప్రజలు ప్రైవేటు వైద్యంపై ఆధార పడుతున్నారు. ఈ ఆరోగ్య కేంద్రాలపై ప్రజల్లో కనీస అవగాహన లేదు. చాలాచోట్ల రోజుకు సగటున 20 నుంచి 30 వరకూ మాత్రమే ఓపీ ఉంటోంది. వాస్తవానికి ఈ కేంద్రాల్లో 64 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలి. బీపీ, షుగర్, టైఫాయిడ్, మలేరియా, సీపీబీ వంటి పరీక్షలు మాత్రమే పరిమితంగా చేస్తున్నారు. ఓపీ పెరగకపోవడానికి ఇదే ప్రధాన కారణం. ఇక్కడ పని చేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులు, సిబ్బంది వెళ్లిపోవడంతో ఏళ్ల తరబడి పోస్టులు ఖాళీగా ఉండిపోతున్నాయి. దీంతో వైద్యసేవలు అందడం లేదు. ఫలితంగా ఇవి ప్రజల్లో విశ్వాసాన్ని పొందలేకపోతున్నాయి.

● ఇదీ పరిస్థితి..

విజయనగరం జిల్లాలో 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరం నగర పాలక సంస్థ, రాజాం, బొబ్బిలి మున్సిపాల్టీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో వీటిని ఏర్పాటు చేశారు. కొవిడ్ సమయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆవశ్యకతను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ కేంద్రాలకు అవసరమైన పరుపులు, మంచాలు, విలువైన యంత్రాలు అందించింది. కానీ నాడు- నేడు పేరిట వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. దీంతో ఇవి అలానే నిరూపయోగంగా ఉండిపోయాయి. ఇప్పటికీ కొన్ని కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. సొంత భవనాలు ఉన్నచోట వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో వైద్యసేవలు అందకుండా పోతున్నాయి.

● అడుగడుగునా నిర్లక్ష్యం..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం కొనసాగింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలను పూర్తి చేయడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించింది. ఫలితంగా ఏళ్ల తరబడి నిర్మాణ పనులు సాగాయి. ఈ హెల్త్ సెంటర్లకు వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా పేరు మార్చారు. కానీ వైద్యులు, ఇతరత్రా సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించలేదు. ఒప్పంద ఉద్యోగులుగా వారిని చేర్చడంతో అరకొరగానే జీతాలు అందుతున్నాయి. దీంతో మంచి వేతనం దక్కే వైద్యులు, ఇతరత్రా సిబ్బంది వెళ్లిపోతున్నారు. దీనికితోడు గత మూడేళ్లుగా అర్బన్ హెల్త్ సెంటర్లకు నిర్వహణ ఖర్చులు మంజూరు చేయలేదు. దీంతో అక్కడ పనిచేసే వైద్యులపై ఈ భారం పడుతోంది. కనీసం విద్యుత్ బిల్లులకు కూడా నిధులు మంజూరు చేయడం లేదు. రాజాం అర్బన్ హెల్త్ సెంటర్లకు సంబంధించి అభివృద్ధి కమిటీలు లేకపోవడం కూడా సేవా లోపానికి కారణంగా చూపుతున్నారు. నిధులు మంజూరు చేయాలంటే అభివృద్ధి కమిటీ చైర్మన్, డాక్టర్‌కు కలిపి జాయింట్ బ్యాంకు అకౌంట్ ఉండాలి. రాజాం మున్సిపాలిటీకి ఎన్నికలు జరగనందున ఈ దుస్థితి తలెత్తుతోందని వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

● అరకొరగా సేవలు..

రాజాంలో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అక్కడ మందులు అరకొరగానే ఉన్నాయి. అదేంటని ప్రశ్నిస్తే మందుల సరఫరా లేదని సిబ్బంది చెబుతున్నారు. అసలు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయని చాలామందికి తెలియదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ ఆరోగ్య కేంద్రాల సేవలు మెరుగు పరచాల్సిన అవసరం ఉంది.

-కంచుపల్లి సీతంనాయుడు, రాజాం

● మెరుగుపరచాలి..

రాజాం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సేవలు మెరుగుపడితే... సీహెచ్‌సీ గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింతగా ఉపయోగపడుతుంది. కానీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం కూటమి ప్రభుత్వమైనా పట్టించుకుంటుందో లేదో చూడాలి.

-వాన శంకరరావు, రాజాం

● ప్రత్యేకంగా దృష్టి..

జిల్లాలో పట్టణ ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ప్రభుత్వం కూడా వీటిపై నివేదికలు తీసుకుంది. ప్రధానంగా ఓపీ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం రాజాం అర్బన్ హెల్త్ సెంటర్లకు అభివృద్ధి కమిటీలు లేకపోవడంతో నిధులు మంజూరు చేయలేకపోతున్నాం. కేంద్రాల నిర్వహణను మరింత పటిష్ఠం చేస్తాం. పట్టణ ప్రజలు ఈ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

-జీవరాణి, డీఎంహెచ్‌వో, విజయనగరం

బిల్లలవలసలో ఇంటింటా సర్వే

బొండపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లలవలసలో మూడు రోజుల వ్యవధిలో 16 మంది డయేరియా బారినపడిన నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం కొత్తగా అతిసారం కేసులు నమోదు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. డయేరియా లక్షణాలతో బాధపడుతున్న రోగులు ఇంటి వద్ద ఉన్న వారితో పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారందరూ కూడా పూర్తిగా కోలుకున్నారని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యుడు ఎల్.సత్యనారాయణ తెలిపారు. అలాగే గ్రామంలో ఇంటింటా సర్వేను నిర్వహిస్తున్నామని, వ్యాధి లక్షణాలు ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నామన్నారు. సచివాలయం వద్ద ఇద్దరు వైద్యుల బృందంతో పాటు వైద్య సహాయకులతో శిబిరాన్ని కొనసాగిస్తున్నామన్నారు.

రోడ్డు కోసం నిరసన

శృంగవరపుకోట రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాలైన గాదెల్లోవ, గూనబాడును కలుపుతూ చిట్టంపాడు గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంగళవారం గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. గిరిజన మహిళలు మాట్లాడుతూ చిట్టంపాడుకు రోడ్డు నిర్మాణం కోసం అటవీ, ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేశారన్నారు. అయితే తమ గ్రామాలను వారు పరిశీలించలేదన్నారు. దీంతో తమ గ్రామాలకు రోడ్డు రాదన్న భయంతో ఉన్నామని ఆందోళన వెలిబుచ్చారు.

రూ.4.5 లక్షలకు చెట్లు వేలం

వేపాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటూరులోని కుళ్ల కోనేరుగట్టుపై ఇరువైపులా ఉన్న నీలగిరి చెట్ల నరికివేత వేలం పాటను యర్రవానిపాలెం గ్రామానికి చెందిన పినిశెట్టి స్వామినాయుడు దక్కించుకున్నారు. అందరి కన్నా అధికంగా రూ.4.50 లక్షలకు వేలం పాట పాడారని పంచాయతీ కార్యదర్శి గురజాపు అనీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కోనేరు గట్టుపై ఇరువైపులా నీలగిరి చెట్లును కొట్టుకునేందుకు అనుమతి పొందారన్నారు. వేలం పాటలో పంచాయతీ విస్తరణ అధికారి మహేశ్, సర్పంచ్ రమణమూర్తి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రాజేశ్‌వర్మకు అభినందనలు

రాజాం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఉప్పలపాటి రాజేశ్‌వర్మను మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, రాజాం పట్టణ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్, పార్టీ విస్తారక్ వేమకోటి గిరిబాబు, సీనియార్ నాయకులు బండి సత్యనారాయణ, గిడివాడ నాగరాజు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి రాజేశ్‌వర్మను అభినందించారు.

●జామి: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఉప్పలపాటి రాజేశ్‌వర్మను జామి మండల బీజేపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం మండల పార్టీ అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు.

అమ్మకాలు ఆపాలని ధర్నా

విజయనగరం దాసన్నపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అరుణ జూట్ మిల్లు కార్మికులకు ఫుల్ అండ్ ఫైనల్ అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు గ్రాడ్యుటీ చెల్లించే వరకూ మిల్లు స్థలాలు అమ్మకాల నిషేధించాలని జూట్ మిల్లు ఎదుట యూనియన్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. పీఎఫ్ బకాయిల కోసం మిల్లు స్థలాన్ని పీఎఫ్ అధికారులు అటాచ్ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బెహరా శంకరరావు, శ్రీనివాసరావు, అప్పారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటి సభ్యత్వాల వేడుక

నెల్లిమర్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారి సంఖ్య కోటి దాటిన సందర్భాన్ని పురస్కరించుకుని విజయనగరంలో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత కేక్ తినిపించారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సభ్యత్వాల ఘనత లోకేశ్‌దే..

నెల్లిమర్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కోటి సభ్యత్వాల నమోదు ఘనత పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌దేనని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. నెల్లిమర్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోటి సభ్యత్వ నమోదుతో టీడీపీ చరిత్రను సృష్టించిందన్నారు. లోకేశ్‌కు రాజకీయ రంగంలో మంచి భవిష్యత్తు ఉందని రవిశేఖర్ అభిప్రాయపడ్డారు.

రూ.50 వేల విరాళం

నెల్లిమర్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లి గ్రామంలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో 50 రోజుల పాటు నిర్వహించనున్న శివ నామస్మరణ కార్యక్రమానికి టీడీపీ నాయకుడు, విజ యనగరం జైత్ర కనస్ట్రక్షన్స్ అధినేత ఆల్తి శ్రీనివాసరావు రూ.50 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు.

మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

లక్కవరపుకోట (కొత్తవలస), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం చేసిన దాడుల్లో 25 మద్యం సీసాలతో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎన్.రమ్యశ్రీ తెలిపారు. వేపాడ మండలం బల్లంకి గ్రామానికి చెందిన ఎం.రాము నుంచి 12, ఎల్.కోట మండలం సీతారాంపురానికి చెందిన తూర్పాటి గంగ నుంచి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నా మన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది రాజులు, రాముడు, ప్రసాద్, ఆదినారాయణ తదితరులు ఉన్నారన్నారు.

వేపాడలో మరొకరు..

వేపాడ (కొత్తవలస), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లంకి సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని కొత్తవలస ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐ నరసింహరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అతడి నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

విశాఖ ఉక్కు అభివృద్ధికి సీఎం కృషి

●మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న రాష్ట్ర మంతి వంగలపూడి అనిత

విజయనగరం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడే కృషి చేశారని రాష్ట్ర మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్‌ను జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ఎన్డీఏ అధికారంలోకి రాగానే, ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు, ఉక్కు పరిశ్రమపై దృష్టి సారించిందన్నారు. ప్లాంట్‌ను బతికించుకోవటానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. గతంలో జగన్ ఢిల్లీ వెళ్లేటప్పుడు తనపై ఉన్న కేసుల నుంచి విముక్తి కోసమే ఆరాటపడ్డారు తప్ప రాష్ట్రానికి తెచ్చింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ రాష్ట్రానికి మేలు జరిగేలా చర్యలు చేపడుతుంటే, వైసీపీ నేతలు ఆందోళన చెందుతు న్నారన్నారు. విజయసాయిరెడ్డి ఏమీ చేయలేక పాదయాత్రతో సరిపెట్టారన్నారు. రామతీర్థం కొండపై రాముడి విగ్రహం శిరస్సు నరికిన కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి సీఎం రిలీఫ్‌ఫండ్ ఎలా ఇస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కేసులో సాక్షికి, నిందితుడికి తేడా ఆయనకు తెలియడం లేదని విమర్శించారు. సాక్ష్యం కోసం అనేక సార్లు పోలీసులు పిలిపించటంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న సదరు వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తే తప్పేంటని ప్రశ్నించారు. రూ.43వేల కోట్ల ప్రజాధనాన్ని కొట్టేసిన వ్యక్తిని వదిలేసి తప్పు చెయ్యని వ్యక్తికి ఇస్తే తప్పా అని నిలదీశారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, అదితి, లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగర్రాజు తదితరులు పాల్గొన్నారు.

బాబుతో ఆర్థిక భరోసా



మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, జనవరి21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థిక భరోసా లభించిందని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లిలోని నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రాకు మణిహారం విశాఖ ఉక్కు కర్మాగారమని, పునరుజ్జీవానికి ఎన్డీఏ ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. గత ముఖ్యమంత్రి జగన్ కేసులు నుంచి విముక్తి పొందడానికి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేందుకు ఢిల్లీ వెళ్తుండేవారని విమర్శించారు. నేడు కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం ఢిల్లీ వెళ్తున్నారన్నారు. విశాఖ ఉక్కును కాపాడేందుకు రూ.11440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేసిందన్నారు. ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసేందుకు జగన్ ప్రయత్నిస్తే దాన్ని పరిరక్షించాలని చంద్రబాబు తపిస్తున్నారన్నారు. దుష్ప్రచారం చేస్తున్న వైసీపీని ప్రజలు నమ్మరని బంగార్రాజు అన్నారు.

స్టీల్ ప్లాంట్‌కు పునరుజ్జీవం: ఎంపీ

విజయనగరం, జనవరి21 (ఆంధ్రజ్యోతి): యావత్తు ఆంధ్ర రాష్ట్రంలో విశాఖ ఉక్కు కర్మాగారం వేలాది మందికి జీవనోపాధి కల్పిస్తుందని అటువంటి ఉక్కు కార్మాగారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుజ్జీవం పోసేందుకు కృషి చేశారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ తన కేసుల నుంచి వి ముక్తి కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెడతానని ఢిల్లీ వెళ్లేవారని, అందుకు భిన్నంగా చంద్రబాబు హస్తినకు వెళ్లారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారి ఏపీకి కేంద్రం గుడ్‌న్యూస్ చెబుతూనే ఉందన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు 11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందన్నారు.

అశోక్‌ను కలిసిన రాష్ట్ర మంత్రులు



అశోక్‌తో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు

విజయనగరం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజును రాష్ట్ర మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, కోళ్ల లలితకుమారి తదితరులు మంగళవారం రాత్రి ఆయన నివాసంలో కలిశారు. జిల్లా పార్టీ సమావేశానికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు అశోక్ గజపతిరాజుని మర్యాదపూర్వకంగా కలిశారు.

కొనసాగుతున్న సర్వే ఉద్యోగుల నిరసన

విజయనగరం కలెక్టరేట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వే శాఖలోని గ్రామ, మండల, డివిజన్ స్థాయి ఉద్యోగులు నిరసన కొనసాగుతోంది. మంగళవారం కూడా విధులు హాజరు కాలేదు. జిల్లావ్యాప్తంగా సర్వే శాఖలో పని చేస్తున్న 542 మంది ఉద్యోగులు ఈనెల 25 వరకూ పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మరోవైపు విజయనగనం ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తున్న డీఐఓఎస్ వెంకటరావు చౌదరిని సోమవారం రాత్రి జిల్లా అధికారులు సరెండర్ చేశారు. జిల్లాలోని పరిస్థితిని సర్వే శాఖ ఏడీ రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. అయితే కలెక్టరుతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేసుకోవాలని కమిషనర్ సూచించనట్లు తెలిపారు. మరోవైపు సర్వే శాఖ రాష్ట్ర ఉద్యోగులు సంఘ నాయకులు బుధవారం జిల్లాకు రానున్నట్లు తెలిసింది.

●కష్టపడి పనిచేసినా కలెక్టరు, జేసీ తమ మనోభావాలు తీవ్రంగా గాయపడేలా మాట్లాడారని జిల్లా సర్వే శాఖ ఉద్యోగులు సంఘం నాయకుడు వెంకటరావు చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, మండల స్థాయిలో పనిచేసే సర్వే ఉద్యోగులు చక్కగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ సమీక్ష సమావేశంలో కలెక్టర్, జేసీ మాట్లాడే భాష చాలా ఇబ్బంది కరంగా ఉందన్నారు. జిల్లా ఉద్యోగులు కాకుండా రాష్ట్రంలో అన్ని జిల్లాలోని కూడా తమకు మద్దతు చెబుతున్నారని తెలిపారు.

సాంకేతికతను వినియోగించండి



మినిస్టీరియల్ సిబ్బందితో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

విజయనగరం క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల నియంత్రణకు సాంకేతికతను వినియోగించాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్పీ వకుల్ జిందాల్ పుష్పగుచ్ఛం ఇచ్చారు. అనంతరం మినిస్టీరియల్ సిబ్బందిని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనిత మాట్లాడుతూ,పోలీసు కార్యాలయాన్ని ఆధునీకరిస్తామని అందుకు కార్యచరణ రూపొందించి పంపించాలని ఎస్పీ వకుల్ జిందాల్‌కు సూచించారు. గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. పసిబిడ్డపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి ఐదు నెలల్లో శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టిన ఎస్పీ వకుల్ జిందాల్‌ను అభినందించారు. మంత్రి అనిత వెంట మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, మంత్రి ఓఎస్డీ అనిల్ పాల్గొన్నారు.

రెండు మాధ్యమాలు అమలు చేయండి

విజయనగరం దాసన్నపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీషు మీడియాలను అమలు చేయాలని, ఉపాధ్యాయులు-విద్యార్థుల నిష్పత్తిని తగ్గించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గణేష్, రామకృష్ణ, రాజయ్య, పల్లె శ్రీనివాసరావు, సుశీల, పి.శ్రీనివాసరావు, శ్రావణ్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు. ●చీపురుపల్లి: విద్యారంగ పరిరక్షణ కోరుతూ యూటీఎఫ్ ప్రతినిధులు స్థానిక ఎమ్మార్సీ ఎదుటమంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మీసాల అప్పలనాయుడు, నడపేన బలరాం, చింత రామకృష్ణ, దువ్వాడ కృష్ణమూర్తి ప్లకార్డులు ప్రదర్శించారు.

నిబంధనలు పాటించండి

విజయనగరం క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని రవాణాశాఖ ఉప కమిషనర్ డి.మణికుమార్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రవాణా శాఖ ఆధ్వర్యంలో భద్రతా నియామాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో జి. విమల, ఎంవీఐలు మురళీకృష్ణ, దుర్గాప్రసాద్, రవిశంకర్‌ప్రసాద్, శివరామగోపాల్, ఉష, కానిస్టేబుల్స్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పు కాపులకు ప్రాధాన్యమివ్వండి

విజయనగరం దాసన్నపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తూర్పు కాపులు 50 శాతానికి పైగా ఉన్నారని, జనాభా ప్రాతిపదికన తూర్పు కాపులకు కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు ఇవ్వాలని తూర్పుకాపు సామాజిక వేదిక జిల్లా అధ్యక్షుడు అంబళ్ల అప్పలనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కామాక్షినగర్‌లోని సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు పి.రామారావు, రొంగలి రామారావు, అప్పలనాయుడు, పిన్నింటి సూర్యనారాయణ, మొదిలి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కూటమితో యంత్రాంగం నిర్వీర్యం

●జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి హయంలో ప్రభుత్వ ప్రభుత్వ యంత్రాంగం నిర్వీర్యమైందని జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు విమర్శలు గుప్పించారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ అధికారులు ఉన్నారా లేరా అన్నట్టు ప్రస్తుత పరిస్థితి ఉందన్నారు. కలెక్టర్, అధికారుల ప్రమేయం లేకుండానే ప్రభుత్వ భవనాలు మార్చడం, నేతలు ప్రమేయంతో భవనాలు పేర్లు మార్చేస్తున్నారన్నారు. ఇదంతా ఎమ్మెల్యేలు చేయించడం హాస్యాస్పదమన్నారు. వేపాడ మండలంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయాన్ని కలెక్టర్ అనుమతి లేకుండా రైతు భరోసా కేంద్రంగా మార్చేయడం ఏంటని ప్రశ్నించారు. ఉపాధి హామీ నిధులతో టీడీపీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా పనులు చేయిస్తున్నారని, స్థానిక సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఆయనతో పాటు వేపాడ మండల నాయకులు ఉన్నారు.

ఉనికి కోసమే చిన్నశ్రీను పాట్లు

●మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే లలితకుమారి

విజయనగరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేపాడ మండలం బానాది గ్రామ సచివాలయం, ఆర్‌బీకేలో ఫర్నీచర్‌ను ఎమ్మెల్యే తరలించుకు పోయారనే వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) వ్యాఖ్యలను మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ ఖండించారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బానాదిలో ఊరుకి దూరంగా ఓ ప్రైవేట్ వ్యక్తి స్థలంలో ప్రభుత్వ నిధులతో నిబంధనలకు విరుద్ధంగా భవనాలను నిర్మించారన్నారు. దానికి అనుమతికూడా లేదు. వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిబంధనలు పట్టించుకోకుండా ప్రజలకు ఇబ్బందులు కలిగించారన్నారు. ఇప్పుడు ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ నిధులతో ఊరికి దగ్గరగా సచివాలయ భవనం నిర్మించామన్నారు. ప్రైవేట్ భవనంలోని ఫర్నీచర్, వస్తువులను ఇక్కడకు తీసుకువచ్చి ప్రజలకు మేలైన సేవలందించేందుకు వినియోగిస్తున్నామన్నారు. అధికారం కోల్పోటంతో దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

డోలీ మోతలులేని గ్రామాలే లక్ష్యం

●గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) డోలీల మోత లేని గిరిజన గ్రామాలే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం పెదమేడపల్లిలో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో సీసీ రోడ్లు, కాలువలకు రూ.80 కోట్లు కేటాయించామన్నారు. 100 రోజుల్లో 102 పనులు పూర్తిచేశామన్నారు. మొదటి విడత పనులు పూర్తయితే, రెండో విడత పనులకు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. . కుంబివలస గిరిజన గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆంధ్ర జలాశయంలో చేప పిల్లలు వేసి గిరిజనులకు ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ●పెదమేడపల్లిలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఇందిర, ఎంపీటీసీ సభ్యుడు ఎర్నాయుడు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సంధ్యారాణి సూచించారు. కలిసి పనిచేస్తే ఒకరిని సర్పంచ్‌గా, ఇంకొకరిని ఎంపీటీసీగా గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, గెద్ద అన్నవరం, ముసలినాయుడు, రెడ్డి ఇందిర, రెడ్డి ఎర్నాయుడు, ఎస్.గురునాయుడు, తాడ్డి తిరుపతి, ఎంపీడీవో బానుమూర్తి, పీఆర్ జేఈ గౌతం తదితరులున్నారు.

కొండగుంపాంలో వివాహిత ఆత్మహత్య

క్రైం కార్నర్

నెల్లిమర్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన గరుగుబిల్లి ఆదిలక్ష్మి మంగళవారం తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి కెల్ల సూరప్పడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్ల మండలం కెల్ల గ్రామానికి చెందిన ఆదిలక్ష్మికి 20 ఏళ్ల క్రితం నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామానికి చెందిన గరుగుబిల్లి లక్ష్మణరావుతో వివాహమైంది. లక్ష్మణరావు నెల్లిమర్ల మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోందని, ఆ బాధను భరించలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తండ్రి సూరప్పడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంట్యాడ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన మీసాల రమణమూర్తి మంగళవారం మృతి చెందారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ సాయికృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రమణమూర్తి గతంలో నల్గొండలోని ఒక ఫార్మా కంపెనీలో కెమిస్ట్‌గా విధులు నిర్వహించేవారన్నారు. అనారోగ్య కారణాల రీత్యా అక్కడ ఉద్యోగం మానేసి ఏడాదిఖాళీగా ఉన్నారన్నారు. ఇటీవల అచ్యుతాపురంలోని ఓ ఫార్మా కంపెనీలో చేరారన్నారు. సంక్రాంతికి ఇక్కడికి వచ్చారన్నారు. ఈనెల 19న గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక మామిడి తోటలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడారన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు విజయనగరం ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రమణమూర్తి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మద్యానికి బానిస కావడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తోంది.

యువకుడి ఆత్మహత్య

లక్కవరపుకోట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగ గ్రామానికి చెందిన నెక్కల దేముళ్లు (44) మంగళవారం గ్రామానికి సమీపంలోని నెక్కల వారి కల్లాల్లో చింతచెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సర్పంచ్, వీఆర్వోలు తెలిపిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట పీహెచ్‌సీకి మృత దేహాన్ని తరలించామన్నారు మృతుడికి భార్య సూరీడమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. భార్య సూరీడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చెట్టు కొమ్మపడి యువకుడు..

వేపాడ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగంగుబూడి గ్రామ శివారు దిబ్బపాలెంలో చెట్టు కొమ్మపడి యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి స్థానికులు, వల్లంపూడి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలంలోని కళ్లెంపూడి గ్రామానికి చెందిన యువకుడు ఏడువాక శేఖర్ (20) చెట్టు నరుకుతుండగా ఆకస్మాత్తుగా చెట్టు కొమ్మ పడి మృతి చెందారు. శేఖర్ చెట్లు నరికేందుకు కూలికి వెళ్తుంటారు. ఎప్పటిలాగే దిబ్బపాలెంలో చెట్లు నరికేందుకు వెళ్లాడు. చెట్టు నరుకుతుండగా చెట్టు కొమ్మ పడి మర్మాంగానికి తీవ్రంగా గాయమైంది. దీంతో శేఖర్ స్పృహ కోల్పోయారు. సహచరులు కొండగంగుబూడిలో సమీపంలో ఉన్న హెల్త్ సెంటర్‌కు ట్రాక్టర్‌పై తరలించారు. అప్పటికే శేఖర్‌ను మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడు తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగి మరొకరు..

పెందుర్తి (విశాఖపట్నం), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా సాలూరు ప్రాంతానికి చెందిన ఓ యువకుడు విశాఖ జిల్లా పెందుర్తి సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తిలోని పెద్ద చెరువు వద్ద ఓ యువకుడి మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించి మంగళవారం ఉదయం పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహం వద్ద లభించిన ఆధారాలను బట్టి విజయనగరం జిల్లా సాలూరు సమీపంలోని జీగిరాం గ్రామానికి చెందిన పఠాన్ వలీసా (25)గా గుర్తించారు. మృతదేహం సమీపంలో పురుగు మందు బాటిల్ లభించడంతో దానిని తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈమేరకు మృతుని కుటుంబీకులకు సమాచారం అందించారు. కాగా సాలూరు నుంచి ఇక్కడకు పఠాన్ వలీసా ఎందుకు వచ్చాడు.. ఆత్మహత్యకు కారణాలు ఏమిటో తెలియరాలేదు. వలీసా మృతదేహాన్ని పోలీసులు పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ సతీశ్ కేసు నమోదు చేశారు.

రైతుల కష్టం బుగ్గిపాలు

● కాలి బూడిదైన రూ.4 లక్షల విలువైన ధాన్యం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శృంగవరపుకోట రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతన్న ఆరుగాలం కష్టం అగ్గిపాలైంది. ధాన్యం నిల్వ చేసిన పురులు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కిలారి శ్రీను, కిలారి కుమార్, ఈశ్వరరావు, అప్పలనాయుడు, సన్నిబాబు, కాసులమ్మ, ఈశ్వరమ్మ, భవానీలు గ్రామ సమీపంలోని కల్లాల్లో 8 ధాన్యం పురులు వేయించారు. ఒక్కో పురిలో 30 ధాన్యం మూటలు సరిపడే ధాన్యం నిల్వ చేశారు. పండుగ తరువాత వీటిని అమ్ముకునేందుకు సిద్ధమయ్యారు. అయితే సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో ఈ పురులకు నిప్పు అంటుకుంది. దాంతో రైతులు అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసినప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సుమారు రూ.నాలుగు లక్షలు ధాన్యం బుగ్గపాలైందని రైతులు తలలు పట్టుకున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వృద్ధురాలి మృతి కేసు దర్యాప్తులో పురోగతి

రామభద్రపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొట్టక్కి గ్రామానికి చెందిన వృద్ధురాలు దండు సింహాచలం మృతిచెందిన కేసు పోలీసుల దర్యాప్తులో పురోగతి కనిపిస్తోంది. ఈనెల 15న సింహాచలం మృతిచెందిన విషయం విదితమే. ఈమేరకు ఆ ఇద్దరు యువకులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఆమె దగ్గర బంగారం, డబ్బుల కోసమే హత్య చేసి ఆత్మహత్య గా చిత్రీకరించారని భావించి పోలీసులు అనుమానాస్పదంగా మృతి కేసు నమోదు చేశారు. కొట్టక్కికి చెందిన పలువురు యువకులను విచారించారు. ఇద్దరు యువకులు హత్య చేసినట్లు నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది.

రామమందిరాలను మంజూరు చేయండి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సాలూరు,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆధ్యాత్మికత బావం పెంపొందించేందుకు రామమందిరాలను మంజురు చేయాలని పాచిపెంట మండలం పణుకువలస, గుంటమామాడివలస, కందిరవలస, మావుడి పంచాయతీ యర్రగడ్డవలస గ్రామ గిరిజనులు కోరారు.ఈ మేరకు మంగళవారం సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. సాలూరు మండలంలోపి మావుడి పంచాయతీ యర్రగడ్డవలస నుంచి మావుడి వరకు రోడ్డు పూర్తిగా పాడైందని తెలిపారు.

క్రికెట్‌లో సత్తాచాటిన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో సత్తాచాటిన పాచిపెంట మండలం క్రీడాకారులను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభినందించారు. గతేడాది 30, 31, తేదీల్లో ఒంగోలులో జరిగిన స్టేట్ క్రికెట్ టీ-20 చాంపియన్స్ ట్రోపిలో సత్తాచాటారు. ఈమేరకు ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో త్వరలో జరిగేపోటీలో రాష్ట్రం తరుపున ఆడనున్న శ్రీధర్, అకిరానందన్, చరణ్‌తేజ్, కోచ్ దుర్గా ప్రసాద్‌ను సత్కరించి రూ.పదివేలు అందజేశారు.కార్యక్రమంలో పిన్నింటి ప్రసాద్‌బాబు, యుగంధర్, ముఖీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

దావోస్‌లో విజయచంద్ర



రామ్మోహన్‌నాయుడుతో ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజయ్యారు. ఈ మేరకు అక్కడ కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మో హన్ నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పారి శ్రామికవేత్తలు, ప్రముఖులను కలిశారు.

చినగుడబ క్వారీపై నివేదిక



క్వారీని పరిశీలిస్తున్న తహసీల్దార్ బాల

గరుగుబిల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగుడబ ప్రాంతంలో క్వారీపై పూర్తిస్థాయిలో నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ పి.బాల తెలిపారు.మంగళవారం చినగుడబ ప్రాంతంలోని క్వారీని తహసీల్దార్‌తోపాటు పలు శాఖల అధికారులు పరిశీలించారు. క్వారీలో ఆక్రమణలతో పాటు కాలువల నీటిని మళ్లించడంపై రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదుమేరకు పరిశీలించి నివేదికఇవ్వాలని కలెక్టర్‌తహసీల్దార్‌కు ఆదేశించారు. దీంతో ఫిర్యాదుదారుల నుంచి సమాచారాన్ని తహసీల్దార్ సేకరించారు.క్వారీ నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నిబంధనల మేరకే నిర్వహిస్తున్నామని, ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు.

తంపటాపల్లిలో పశువైద్య శిబిరం

పాలకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని తంపటాపల్లి, బెజ్జిల్లో మంగళవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూగజీవాలకు నట్టల నివారణ మందులు వేసి చికిత్సలు చేశారు. జిల్లా పశు సంవర్థకఅధికారి శివ్వాల మన్మథరావు పశువైద్య శిబిరాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివ్వాల శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పి.మాణిక్యరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.సిద్దార్థ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

గరుగుబిల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం గరుగుబిల్లి హనుమాన్ సముదాయం ప్రాంతంలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి, ఖడ్గవలస ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

ఒడిశాకు తరలిస్తున్న బియ్యం స్వాధీనం

పార్వతీపురం రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బొండపల్లిలో 2,750 కిలోల పీడీఎఫ్ బియ్యం వాహనంలో ఒడిశాలోని అలమండకు తరలిస్తున్నారు. ఈ విషయంపై సమాచారం అందడంతో మంగళవారం సీఎస్‌డీటీ ఎం.రాజేందర్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పట్టుకొని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

సీతానగరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినభోగిలిలో ఏవో ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటను పరిశీలించి మెలకువలను వివరించారు.

'పీఎం సూర్యఘర్'పై అవగాహన

సీతానగరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకానికి వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు విద్యుత్ ఏడీ సీహెచ్ వి.రమణరావు తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సూర్య గర్ పథకంపైఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహ సీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఏఈ ఎ.జగన్మోహనరావు పాల్గొన్నారు.

సీతంపేటలో వాహనాల తనిఖీ

సీతంపేట రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సీతంపేటలో ఎస్‌ఐ వై. అమ్మనరావు మంగళవారం వాహనాలను ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ వినియోగం, స్పీడ్ లిమిట్‌పై చోదకులకు అవగాహన కల్పించారు.

కొత్తగూడలో ఇల్లు దగ్ధం

గుమ్మలక్ష్మీపురం,జనవరి 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తగూడ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంగళవారం మధ్యాహ్నం పూరిల్లు ఆరిక మాధవరావు దగ్ధమయ్యింది. సుమారు లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల ప్రాణనష్టం జరగలేదు.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి

బొబ్బిలి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోగల మల్లంపేటలో పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఐదుగురిపై దాడి చేసి గాయపరిచింది. మంగళవారం రైల్వే స్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న భవన నిర్మాణ కార్మికుడు రఘుపై దాడి చేసింది. ఓ చిన్నారి, మరో ముగ్గురుపై దాడి చేసి గాయపరచడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గాయపడిన ఐదుగురు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రాయగడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాయగడ రైల్వే స్టేషన్‌లోని ఐదో నెంబరు ప్లాట్‌ఫారంపై ఓ మతిస్థిమితం లేని బీహార్‌కు చెందిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మంగళవారం మృతిచెందాడు.రైల్వే అధికారులు, జీఆర్పీపోలీసుల కథనం మేరకు.. ఐదో నెంబరు ప్లాట్‌ఫారంపై నిలిచి ఉన్న గూడ్స్ రైలుపైకిఉదయం 11గంటల సమయంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తిఎక్కాడు. ప్రయాణికులు చూస్తుండగానే హైపవర్ విద్యు త్ తీగలను పట్టుకోవడంతో విద్యుత్‌ఘాతానికి గురై నేలకూలిపోయాడు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు ఒళ్లంతా కాలిపోయిన ఆయన్ను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు.

నిధులు లేక.. పనులు పూర్తికాక



కాశిందొరవలసలో నిలిచిపోయిన మరుగుదొడ్డి నిర్మాణం

● అర్జీదారులు, సిబ్బందికి అగచాట్లు ● సచివాలయాల్లో నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాలు

బొబ్బిలి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామ సచివాలయాల ప్రాంగణాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో అర్జీదారులు, సిబ్బంది అగచాట్లకు గురవుతున్నారు.30 గ్రామ సచివాలయాలు, రైతుసేవా కేంద్రాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే అర్జీదారుల కోసం, సిబ్బందికి ఉపయోగపడేలా గత ప్రభుత్వం మరుగుదొడ్లు మంజూరుచేసింది. ఇప్పటివరకూ ఆరు మాత్రమే పూర్తి చేశారు. కాశిందొరవవలస, మెట్టవలస తదితర గ్రామాల్లో నిధులు లేకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.దీంతో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతకావడంతో పురుషులు ఆరుబయటకు వెళ్తున్నారు. కాగా మరుగుదొడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణకుమార్ తెలిపారు.

విశాఖ ఉక్కు కర్మాగారానికి ఆర్థిక భరోసా

● ఊపిరిపోసిన ఎన్‌డీఏ ప్రభుత్వం ● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



మాట్లాడుతున్న బేబీనాయన

బొబ్బిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):ఎందరో త్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ నిలదొక్కుకునేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం ఊపిరి పోస్తూ ఆర్థిక భరోసా కల్పించిందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మంగళవారం స్థానిక కోటలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు మంజూరుచేసినట్లు తెలిపారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేంద్రం ఏదో ఒక వరాన్ని రాష్ట్రానికి ప్రకటిస్తోందన్నారు. గత పాలకులు ఢిల్లీ పర్యటనలు దేనికోసం చేశారో అందరికి తెలుసన్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తిసామర్థ్యం గల విశాఖ ఉక్కుకర్మాగారంతో యావత్ ఆంధ్రులకు అనుబంధంఉందన్నారు. 1994లో సంక్షోభంలో ఉన్న విశాఖ ఉక్కును అమ్మేందుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంకావడంతో అప్పట్లో దివంగత కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు తదితర పెద్దలు అడ్డుకోగలిగారని బేబీనాయన గుర్తుచేశారు.టీడీపీ హయాంలో రికార్డు స్థాయిలో లాభాలు వచ్చేలా కృషిచేశారని, 2002లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా కఠోరమైన సత్యాలను దాచలేరని తెలిపారు.

పాఠశాలలకు నిధుల మంజూరు: ఏఈ

బొబ్బిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పలు పాఠశాలలకు నిధులు మంజూరైనట్లు సమగ్ర శిక్ష ఏఈ బూసర్ల కిశోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ నాలుగు మండలాల్లో గల కేజీ బీవీలకు రూ.18.50 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయని తెలిపారు. బాడంగి కేజీబీవీకి అదనంగా సైన్స్ ల్యాబ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ల్యాబ్‌కు 18.50 లక్షలు చొప్పున, ల్యాబ్ పరికరాల కోసం రూ. 2 లక్షలు చొప్పున, బొబ్బిలి మండలంలోని పిరిడి జడ్పీహెచ్‌ఎస్‌కు రూ.13.25 లక్షలతో సోలార్ ప్యానెల్స్, తాగునీటి సదుపాయం, ఫిజిక్స్ ల్యాబ్‌కు మంజూరు కాగా మరో రూ.7.50 లక్షలు కిచెన్ గార్డెనింగ్, ర్యాంపులు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌కు నిధులు మంజూరైనట్లు తెలిపారు. బాడంగి, రామభద్రపురం జడ్పీహెచ్‌ఎస్‌లు, పెరుమాలి మోడల్ స్కూల్‌కు రూ.8.75 లక్షలు చొప్పున మంజూరయ్యాయన్నారు. బొబ్బిలి గురుకులానికి రూ. 15.50 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ మంజూరుకావడంతో నిర్మాణం పూర్తి చేశామన్నారు.రూ.ఐదు లక్షలతో ఆటస్థలం పనులు సాగుతున్నాయ న్నారు. ఈపనులు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫౌండేషన్ పాఠశాలల ప్రతిపాదన వద్దు



రామభద్రపురం: ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విజయగౌరి

రామభద్రపురం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ పాఠశాలల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రామభద్రపురం ఎంఆర్‌సీ భవనం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈవోలు మండల ఆమిటి తిరుమలప్రసాద్, పెంటయ్యలకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి కేశవరావు, మండలాధ్యక్షులు సుధాకరరావు, నాయకులు వెంకటరావు, త్రినాథరావు, జ్యోతి, పల్లికల వరప్రసాద్ పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ పాఠశాల ప్రతిపాదన విరమించుకోవాలని, సబ్జెక్టు టీచర్లను నియమించి ప్రాథమికోన్నత పాఠశాలలను బలోపేతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.కస్తూరి కోరారు. మంగళవారం బొబ్బిలి ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో - 2 గొట్టాపు వాసుదేవరావు, యూటీఎఫ్ బొబ్బిలి మండల గౌరవాధ్యక్షుడు ఎన్.రమేష్, అధ్యక్షులు ఎన్.మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్ పి.సత్యనారాయణ, కృష్ణదాస్ పాల్గొన్నారు.

డీలర్లు సమయపాలన పాటించాలి

బొబ్బిలి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చౌక డిపోల డీలర్లు లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు.మంగళవారం తహసీల్దార్‌కార్యాలయంలో చౌకడిపోల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలానిబంధనల ప్రకారం వినియోగదారులకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సాయికృష్ణ పాల్గొన్నారు.

సాలూరులో అమ్మవార్లకు ఉపాహారాలు

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు



సాలూరు రూరల్: కొత్తమ్మకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

సాలూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని కొత్తమ్మ, ముత్యాలమ్మ, నూకాలమ్మ, పైడితల్లి, పరదేశమ్మ, కుండల పోలమ్మ, కోట దుర్గ,సత్తెమ్మ తదితర అమ్మవార ఆలయాలకు మంగళవారం భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది మేలో సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండగను నిర్వహించనున్న విషయం విదితమే. గ్రామదేవత పండగ ముందుగా గ్రామంలో ఉన్న అమ్మవారులకు కోళ్ల, చీరలతోపాటు పసుపు కుంకుమ, ఉపాహారాలు (మొక్కుబడులు) చెల్లించారు. కొత్తమ్మ, ముత్యాలమ్మ తదితర ఆలయాలకు వేకువజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఎస్‌ఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యం కలగకుండా శ్యామలాంబ ఉత్సవ కమిటీ చైర్మన్ అక్యాన అప్పారావు పర్యవేక్షించారు. కాగా అమ్మవార్లకు మొక్కుబడులు చెల్లించాల్సిన నేపథ్యంలో మంగళవారం సాలూరు మార్కెట్‌లో నాటు కోడిపుంజుల ధరలు వ్యాపారులు అమాంతంగా పెంచేశారు. కోడిపుంజు ధరలు రూ. 13 వందల నుంచి రూ. 2100 వరకు విక్రయించారు.

నీలమణి దుర్గమ్మకు పూజలు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారిని కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు పాడి సుదర్శన రావు, అడ్డాకుల నరేష్, కొనిస మన్మథరావు, శొంఠ్యాన రాజేష్, వెంపటాపు భారతమ్మ, సుబ్బలక్ష్మి ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి నిఘంటువు లెనిన్



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

బెలగాం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి దారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి, ప్రజాస్వామ్యానికి నిఘంటువులా లెనిన్ మారారని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో లెనిన్ శతజయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ విప్లవ సమాజానికి ఎదురైన ప్రతి క్లిష్ట సమయంలో సరైన మార్గాన్ని చూపిన వ్యక్తి లెనిన్ అని తెలిపారు. ప్రజాస్వామ్యం కోసం ప్రశ్నించే పౌరులు, మేధావులను దేశద్రోహులుగా నేటి ప్రభుత్వాలు చిత్రీకరిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు రెడ్డి వేణు, జిల్లా అధ్యక్షులు కొల్లి గంగు నాయుడు, తిరుపతి రావు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రతిపాదనలు

●ఢిల్లీలో జరిగిన జన్‌మన్ సదస్సుకు హాజరైన కలెక్టర్ శ్యాంప్రసాద్



ఢిల్లీలో జరిగిన జన్‌మన్ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పార్వతీపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి త్వరలో పంపించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ ఆధ్వర్యంలో జరిగిన జన్‌మన్ సదస్సుకు కలెక్టర్‌తోపాటు పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులపై పూర్తిస్థాయిలో ప్రతిపాదనలను జిల్లా నుంచి అందించాలని కోరినట్లు కలెక్టర్ తెలిపారు. వంద మంది జనాభా గల గిరిజన గ్రామాలకు బీటీ రహదారుల నిర్మాణంతోపాటు తాగునీరు తదితర మౌలిక వసతులపై ప్రత్యేకంగా చర్చించినట్లు చెప్పారు.

పాఠశాలల్లో సోషల్ ఆడిట్



పురోహితునివలస ఆదర్శ పాఠశాలలో క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న సోషల్ ఆడిట్ బృందం

సాలూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో మంగళవారం సమగ్ర శిక్షాభియాన్, సామాజిక ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. రికార్డు నిర్వహణ, మధ్యాహ్న భోజనం, క్రీడలు, గ్రంథాలయం, ల్యాబ్ తదితర వాటిని పరిశీలిం చాయి. సాలూరు పట్టణంలో డబ్బివీధి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్టేట్ రిసోర్స్‌పర్సన్ బి.దాసు, డీఆర్పీలు బి.శ్రీను, బి.వరహామూర్తి ఆడిట్ నిర్వహించారు. వారికి హెచ్‌ఎం సరోజనిరెడ్డి పాఠశాల నిర్వహణ వివరాలు అందించారు. అనంతరం ఆ బృందం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసింది. ఇక సాలూరు మండలం పురోహితునివలస ఆదర్శ పాఠశాలను సామాజిక ఆడిట్ బృందానికి చెందిన ఎం.నారాయణమూర్తి, బి.శివ పరిశీలించారు. స్కూల్ వివరాలు, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సాధించిన పతకాలు, విజయాలను హెచ్‌ఎం ఎస్.అంజలిదేవి , పీడీ తదితరులు తెలిపారు. అనంతరం పాఠశాలల్లో వివిధ అంశాలను ఈ బృందం పరిశీలించింది.

బాలల సంరక్షణ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాత బొబ్బిలిలోని ప్రభుత్వ బాలసదన్‌తో పాటు హేండ్ ఇన్‌హేండ్ సొసైటీ, సన్‌రైజ్‌హోమ్ ఎన్‌జీవోల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను జిల్లా పర్యవేక్షకమిటీ కన్వీనరు, డీపీఓ ఓవీఎల్ సత్యనారాయణ, కో కన్వీనరు బీహెచ్ లక్ష్మితో కూడిన బృందం మంగళవారం పరిశీలించింది. రికార్డులను తనిఖీచేసి, కేంద్రాల నిర్వహణ, అక్కడ ఉన్న బాలల స్థితిగతులు, నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

● నాలుగేళ్లలో రూ.1450కోట్లతో పనులు

● గురుకులాల సొసైటీ కార్యదర్శి, సమగ్ర శిక్ష డైరెక్టర్ మస్తానయ్య

బొబ్బిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేం దుకు ప్రభుత్వం నాలుగేళ్ల ప్రణాళికను అమలు చేస్తున్నట్లు ఏపీ గురుకుల పాఠశాలల సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శి, రాష్ట్ర సమగ్ర శిక్ష డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య తెలిపారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పీఎంశ్రీ పథకానికి 855 పాఠశాలలు ఎంపిక చేసినట్లు చెప్పారు. బొబ్బిలి బాలుర గురుకుల పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించా రు. ఈ సందర్భంగా గురుకులంలో రూ.15.5 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్ భవనాన్ని, రూ.5 లక్షలతో జరుగుతున్న ప్లేగ్రౌండ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60-40 శాతం వాటాధనంతో నాలుగేళ్ల పాటు రూ.1450 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాయన్నారు. ఇప్పటికే పనులు మొదలైనట్లు చెప్పారు. పీఎంశ్రీ నిధులతో లేబరేటరీస్, అందులో పరికరాలు, ర్యాంపులు, లైబ్రరీలు తదితర వాటిని సమకూర్చుతున్నామ న్నారు. గత ఏడాది రూ.177 కోట్లు, ఈ ఏడాది రూ.450 కోట్లు మంజూరయ్యాయన్నారు. గురుకులాల్లో ఖాళీగా ఉన్న 194 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. 14 ప్రిన్సిపాల్ పోస్టులు, 53 పీజీటీ, 120 టీజీటీ, మూడు పీఈటీ పోస్టులకోసం ప్రతిపాదనలు పంపామని, వచ్చే విద్యాసంవత్సరానికల్లా భర్తీ అయ్యేఅవకాశం ఉందన్నారు.తొలుత విద్యార్థుల సిక్ రూమ్‌ను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు సౌకర్యంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సుమారు 12.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ గురుకులానికి 40 ఏళ్లు దాటినా ప్రహరీ లేని విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా నిర్మా ణం కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాల న్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రఘునాథ్, సమగ్ర శిక్ష ఏఈ కిశోర్‌కుమార్ ఉన్నారు.

అమరావతిని ఫ్రీజోన్ చేయాలి

● ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి అప్పన్న

బొబ్బిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని ఫ్రీజోన్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న సంఘ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు.మంగళవారం బొబ్బిలి గంటి ప్రసాదం స్మారకభవనంలో వచ్చే నెల ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు శ్రీకాకుళంలో జరగనున్న ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తోందని ఆరోపించారు. యువజన విధానం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ,నూతన నోటిఫికేషన్లు, తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమాల కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ రాష్ట్రకార్యదర్శి సాయికిరణ్‌యాదవ్, తులసి. శ్రీనివాస్, తిరుపతిరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల వెరిఫికేషన్

మక్కువ,జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 పంచాయతీల్లో బుధ వారం నుంచి మొదటి విడతగా 197 దృష్టి లోపం, 683 అంగవైకల్యంతో కలిపి 880 దివ్యాంగ పింఛన్లపై సమగ్రంగా వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డీడీ స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 24 వరకు వెరిఫికేషన్ జరుగుతుందని పేర్కొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

సాలూరురూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడానికి గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ సాలూరు డిపో మేనేజర్ భాస్కరరెడ్డి చెప్పారు. మంగళవారం సాలూరులో విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 నుంచి 12 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు 9959225622 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

హెల్మెట్ ధరించాలి

బెలగాం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ తెలిపారు. పార్వతీపురంలో విద్యార్థులకు రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజా రవాణా అధికారులతోకలిసి అవగాహన కల్పించారు.

ద్వారపురెడ్డికి మాతృ వియోగం

పార్వతీపురం టౌన్/గరుగుబిల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, వైద్యుడు ద్వారపురెడ్డి రామ్మోహన్‌రావు తల్లి సావిత్రమ్మ(93) మంగళవారం మృతి చెందారు.ఆమె మృతితో పట్టణంలో విషాదచాయలు అలముకున్నాయి. పార్వతీపురం కర్షక మహర్షి ఆసుపత్రి ఆవరణలో సావిత్రిమ్మ పార్థివ దేహన్ని ఉంచారు.ధనుంజయరావు, తిరుపతిరావు, యాళ్ల వివేక్, బోగి ఈశ్వరరావు, బార్నాల సీతారామ్‌తోపాటు కోలా వెంకటరావు, ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు. ద్వారపురెడ్డి కుటుంబ సభ్యులను బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనతో పాటు పట్టణ ప్రముఖులు టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, తదితరులు పరామర్శించారు.

రామమూర్తికి నివాళి

బొబ్బిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పాతకోటలో విశ్వబ్రాహ్మణ జాతిపిత పండిత గానాల రామమూర్తి జయంతి పురస్కరించుకుని మంగళవారం చిత్రపటానికి సీఐ కటకం సతీష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో సంఘం నాయకులు వెంకటరమణాచార్య, అరిటికట్ల శ్రీనివాస్,పాలకొల్లు రామారావు, సర్వసిద్ధి త్రినాథ, గనుబోలు నారాయణరావు, గడిజాల చక్రధరరావు పాల్గొన్నారు.